సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 28 । జనవరి । 2024



డిమాండ్లు పరిష్కరించాలి

ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్‌లుగా గుర్తించాలని (టీఎస్ ఈఈయూ–327) రాష్ట్ర సెక్రటరీ జనరల్ శ్రీధర్ కోరారు. - 8లో



భద్రత జీవనవిధానం కావాలి

రహదారి భద్రత సామాజిక బాధ్యత, జీవన విధానంగా మల్చుకున్నప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని వరంగల్ ఆర్టీఓ రంగారావు సూచించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$30^{0}/19^{0}$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరుగుతుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాస్థాయికి ఎంపిక



భూపాలపల్లి రూరల్: మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ తెలిపారు. జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి టెస్టు నిర్వహించి విజేతలకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేసినట్లు చెప్పారు. ప్రథమ స్థానంలో భూపాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాంటిసోరీ ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో సస్‌వాలి ఉన్నత పాఠశాల, గొల్ల బుద్దారం ఉన్నత పాఠశాలలు నిలిచాయని తెలిపారు. ఈ పాఠశాలల విద్యార్థులు ఫిబ్రవరి 3న జరిగే జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బానోతు సేవానాయక్, ఉపాధ్యక్షుడు సూర్య కిరణ్, భూపాలపల్లి ఉన్నత పాఠశాల ప్రధాపాధ్యాయురాలు లక్ష్మి ప్రసన్న, ఉపాధ్యాయులు దేవేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

ఇగ్నైట్ ఫెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ



కాటారం: గురుకుల పాఠశాలల రాష్ట్ర స్థాయి ఇగ్నైట్ ఫెస్ట్‌లో కాటారం మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల అప్‌గ్రేడ్ కళాశాలకు చెందిన విద్యార్థిని హర్షిత ప్రతిభ కనబర్చారు. ఇంగ్లిష్ స్పెల్ బీ సబ్ జూనియర్ విభాగంలో హర్షిత రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. భద్రాచలం గిరిజన సంక్షేమ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హర్షిత ఉన్నతాధికారుల చేతుల మీదుగా నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంస పత్రం అందుకున్నారు. హర్షిత రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయినులు, విద్యార్థులు హర్షం వ్యక్తంచేసి అభినందనలు తెలిపారు.

సీఆర్‌నగర్‌లో కార్డన్‌సెర్చ్

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని సీఆర్‌నగర్‌లో శనివారం రాత్రి భూపాలపల్లి పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. భూపాలపల్లి ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డన్‌సెర్చ్‌కు డీఎస్పీ రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా సరైన ధృవీకరణ పత్రాలు లేని 26, నంబర్‌ప్లేట్ లేని ఏడు ద్విచక్ర వాహనాలు, 29 లీటర్ల మద్యం, 12 లీటర్ల గుడుంబాను పట్టుకొని సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సీఐ వేణుచందర్, భూపాలపల్లి, గణపురం, చిట్యాల, రేగొండ ఎస్సైలు సాంబమూర్తి, రవికుమార్, రమేష్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాజాతర పనుల్లో వేగం పెంచాలి



ఏటూరునాగారం: మేడారం మహాజాతరలో అన్ని శాఖల ద్వారా చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ప్రధాన గద్దెల వద్ద రంగులు వేయించాలని అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుండటంతో ప్రధాన గద్దెల వద్ద లైటింగ్ ఏర్పాట్లు, పేయింటింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఈఈ రాజేందర్‌ను ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ సివిల్ పనులు, పార్కింగ్ స్థలాల వద్ద ఏర్పాట్లపై సమీక్షించారు. రోడ్డు పనుల స్థితిగతులు, ఊరట్టం, మేడారంలోని ఆశ్రమ పాఠశాలలకు ప్రత్యేక మరమ్మతులు చేయాలన్నారు.

పనులు పూర్తిచేయాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలోని జంపన్నవాగు వద్ద చేపట్టిన దుస్తుల మార్చుకునే గదుల పనులను వెంటనే పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలో, మేడారంలో జరుగుతున్న పనులను పీఓ శనివారం పరిశీలించారు. మేడారం ఐటీడీఏ అతిథి గృహంలో మరమ్మతు పనులను పరిశీలించి పనులు వేగంగా రెండు రోజుల్లో పూర్తి చేయాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, టెక్నికల్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. మ్యూజియాన్ని సందర్శించి, భవనానికి సంబంధించిన పెయింటింగ్ పనిని పరిశీలించారు.

చిందుగానం..! పద్మరాగం!!



- పద్నాలుగో ఏట కులవృత్తిలోకి వచ్చా..
- 20వ ఏట అర్జునుడి పాత్రతో చిందు బృందానికి నాయకత్వం
- ప్రదర్శనలతోపాటు భిక్షాటనతోనే కుటుంబం గడిచేది
- హంస (కళారత్న) అవార్డుతో ఎంతో ప్రోత్సాహం
- పద్మశ్రీ అవార్డుతో మా కులవృత్తికి దేశవ్యాప్త గుర్తింపు
- గ్రామీణ కళలకు అందలమెక్కించిన పురస్కారం

'సాక్షి'తో పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గద్దం సమ్మయ్య

'చిందులు యక్షగాన కళాకారులు.. వృత్తి ఊరూరా తిరుగుతూ భిక్షాటన.. కులవృత్తినే దైవంగా భావిస్తాం. ఇప్పుడు మా 'చిందు' గానానికి 'పద్మ'రాగం పలికి.. దేశవ్యాప్త గుర్తింపు వచ్చింది. రంగస్థలంపై రారాజులా నిలిపింది'అని సగర్వంగా చెబుతున్నారు ప్రముఖ యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గద్దం సమ్మయ్య. ఇటీవల కేంద్రం సమ్మయ్యకు ఆర్ట్స్ విభాగంలో పద్మశ్రీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు, కుటుంబ నేపథ్యం, కులవృత్తిలో ఒడిదొడుకులు, పద్మశ్రీ వచ్చాక ఆయన అనుభూతిని శనివారం 'సాక్షి'తో పంచుకున్నారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

దేవరుప్పుల:

ఎస్సీ సామాజిక వర్గాల నుంచి ఇనాములు పొంది ఊరూరా చిందు యక్షగాన కళారూపాలు వేయడం మా కులవృత్తి, జీవనాధారం. నా తండ్రి గద్దం రామస్వామి, తల్లి చండికాంబ. కులవృత్తిలో భాగంగా పాలకుర్తి మండలం వల్మిడిలో కొంత కాలం ఆవాసం పొందాం. ఇక్కడే నాతోపాటు ఇద్దరు సోదరులు వెంకటయ్య, గణపతి పుట్టాం. ముగ్గురు అన్నదమ్ములం తల్లిదండ్రులకు చేదోడుగా ఇదే వృత్తిలో కొనసాగుతున్నాం. నా పద్నాలుగో ఏట తండ్రి ప్రోత్సాహంతో జన్మస్థలమైన వల్మిడిలో తొలుత బాలకృష్ణుడి వేషంతో మొదలుపెట్టా. భక్త సిరియాలుడు, లోహితుడు, ప్రహ్లాద, మార్కండేయ, లవకుశుడి పాత్రల్లో రాణించా. 20వ ఏట ఇదే గ్రామంలో అర్జునుడి పాత్రతో మా చిందు బృందానికి ప్రాతినిధ్యం వహించాను.

కులవృత్తి చేస్తూ.. అప్పిరెడ్డిపల్లెలో స్థిరనివాసం..

మా చిందుల వంశవృక్షం చుట్టుపక్కల గ్రామాలను పంచుకుంది. ఏడాదిలో ఆరు నెలలు పంచుకున్న గ్రామాలకు వెళ్లి ఎస్సీ సామాజిక వర్గాలపైనే ఆధారపడి మా జీవితం కొనసాగేది. చివరికి అప్పిరెడ్డిపల్లెలో తల్లిదండ్రులతో స్థిరపడి పలు మండలాల్లో ప్రదర్శనలు ఇచ్చాం. కుటుంబసమేతంగా ఎంత కష్టపడి ప్రదర్శన ఇచ్చినా రూపాయి మిగిలేది కాదు. ఇలాంటి దీనస్థితిలో గ్రామీణ కళలను ప్రోత్సహించే దిశగా 1985లో మా యక్షగాన కళారూపాల ప్రతిభను కనిపెట్టిన వల్మిడికి చెందిన వీరమల్ల సోమదేవరాజు (అఖిల భారత సాంస్కృతిక విభాగం ఉమ్మడి రాష్ట్ర ప్రతినిధి), కోలుకొండకు చెందిన కన్న పరశురాములు (అగ్రగామి ఎడిటర్), బొబ్బిలి ఇంద్రసేనారెడ్డి జ్యోతిర్మయి లలిత కళాసమితి జనగామ సారథ్యంలో ప్రభుత్వ పరమైన సాంస్కృతిక శాఖ విభాగం పక్షాన ప్రదర్శనలు వేసేందుకు తోడ్పాటు అందించారు. వీరిరువురి సహకారంతో తెలుగు విశ్వవిద్యాలయ (పొట్టి శ్రీరాములు), వరంగల్ డీపీఆర్ఓ సారథ్యంలో సమాజ రుగ్మతలైన అక్షరాస్యత, కుటుంబ నియంత్రణ, ఎయిడ్స్ నివారణ వంటి అంశాలపై వందలాది ప్రదర్శనలు ఇచ్చాం. ప్రతి కార్యక్రమానికి ఆ రోజుల్లో రూ.700 ఇచ్చేవారు. అయినా ఏ ఊరికి వెళ్లినా భిక్షాటన చేస్తే తప్ప తమ కుటుంబాలు వెళ్లేవి కావు. కాలానుగుణంగా రెమ్యునరేషన్ పెంచినప్పటికీ కులవృత్తి తప్పలేదు.



గద్దం సమ్మయ్య కుటుంబం

1990లో రాష్ట్రస్థాయి కళాకారుల సంఘం ఏర్పాటు

1990లో వీరమల్ల సోమదేవరాజు ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్రస్థాయిలో 10 మందితో చిందు యక్షగాన కళాకారుల సంఘం ఏర్పాటు చేశారు. తొలుత నన్ను అధ్యక్షుడిగా, సహచరిణి పాత్రలో నటించే గద్దం శ్రీనివాస్ తండ్రి భిక్షపతి ఉపాధ్యక్షులుగా నియమించారు. ఈ సంఘం తెలంగాణవ్యాప్తంగా చిందు కళాకారులను ఐక్యం చేసేందుకు దోహదపడింది. మొదట ఆలిండియా రేడియో, ఆకాశవాణిలో ప్రదర్శనలు ఇచ్చే అవకాశాలు అందిపుచ్చుకునే క్రమంలో సాంస్కృతిక విభాగాధిపతులు కేవీ రమణాచారి, బుర్రా వెంకటేశం, రాళ్లబండి కవితప్రసాద్, మామిడాల హరికృష్ణ తదితరులు వెన్నుతట్టి ప్రోత్సహించారు. తమిళనాడు, మధ్యప్రదేశ్, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల్లో జానపద మేళాల్లో పురస్కారాలు లభించాయి. దాసరి నారాయణరావు దర్శకత్వంలో తొలుత సమ్మక్క–సారలమ్మ, వర్షం, ఆదివిష్ణు, నీది నాది ఒకటే కథ వంటి సినిమాల్లో మా కళారూపాలు ఉన్నాయి. మా ప్రతిభను గుర్తించి అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య చేతులమీదుగా అవార్డులు పొందడంతోపాటు కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో హంస (కళారత్న)అవార్డు లభించింది. ఈ అవార్డుతోనే నాలో మరింత బాధ్యత పెరిగి చిందు కళలకు పదును పెట్టి ఓ గుర్తింపు తేవాలనే సంకల్పంతో ముందుకు సాగాను.



వరంగల్‌లో ఆకాశవాణి సాంస్కృతికోత్సవాల్లో సమ్మయ్య బృందం (ఫైల్)

తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం

తెలంగాణ ఉద్యమంలో మా చిందుల భాగస్వామ్యానికి గుర్తింపుగా రాష్ట్రస్థాయిలో అప్పటి సీఎం కేసీఆర్ బెస్ట్ ఎక్స్‌లెన్స్, వరంగల్‌లో కడియం ఉత్తమ పురస్కారం అందించి భుజం తట్టారు. తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వడంతో మా వృత్తిదారులకు ఉపాధి కరువైందనే బాధ కలిగింది. ఈ క్రమంలోనే నిలువ నీడ కోసం పెద్దకొడుకు సోమరాజుకు డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చారు. ఇలా సాగుతున్న నా జీవితంలో సమాజహితం, బతుకుదెరువు కోసం నటించిన కళాప్రతిభలను పలుసార్లు పద్మశ్రీ అవార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే తృటిలో తప్పింది. మరో ప్రయత్నంగా ఈసారి చేసిన దరఖాస్తుకు ఫలితం దక్కింది. శ్రీరామ జన్మభూమి అయోధ్యలో ఐదు రోజులు ప్రదర్శన ఇచ్చి స్వగ్రామానికి వచ్చాను. అదే రోజు గ్రామీణ కళలకు అందలమెక్కించేలా కేంద్ర ప్రభుత్వం నాకు పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. ఆ సమయంలో నేను పడిన సంతోషం మాటల్లో చెప్పలేనిది. ఇంతటి పురస్కారానికి నా తల్లిదండ్రుల కటాక్షం, భార్య శ్రీరంజని తోడ్పాటు, చిందు కళాకారులకు ఆదినుంచి ఆదరణ ఇచ్చి జీవం పోసిన ఎస్సీల పుణ్యఫలమే. అతిరథ మహారథుల సరసన పద్మశ్రీ అవార్డుకు రావడానికి సహకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, దీపక్‌రెడ్డితోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు.

వ్యవసాయ భూమి ఇవ్వడంతో మార్పు

కళలతో ఉపాధి పొందలేని స్థితిని గమనించి 1997లో అప్పటి వరంగల్ కలెక్టర్ శాలినిమిశ్రాను కలిసి మా పరిస్థితి వివరించాం. ప్రభుత్వపరంగా మా తల్లిదండ్రులు, అన్నదమ్ములకు కలిపి ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి ఉచితంగా ఇచ్చారు. దీంతో భిక్షాటన చేసే మాకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడంతో కుటుంబాల్లో కొంత మార్పు వచ్చింది. ఈ మార్పునకు చిందు కళలే మూలాధారంగా భావించి మాకు కలిగిన ముగ్గురు కొడుకులు సోమరాజు, హిమగిరి, మురళి కృష్ణల సహకారంతో కులవృత్తిని కొనసాగిస్తున్నా. ఇందులో సోమరాజు నా వారసత్వం కొనసాగిస్తుండగా మిగతా ఇద్దరు మారిన సాంకేతికత అనుగుణంగా అడుగులు వేస్తున్నారు.



కళారత్న (హంస)అవార్డుతో గద్దం సమ్మయ్య, భార్య శ్రీరంజని

వైభవంగా ప్రతాపగిరి గుట్ట జాతర



కాటారం ప్రధాన కూడలిలో లక్ష్మీదేవర ఊరేగింపు

కాటారం: కాటారం మండలం ప్రతాపగిరి గొంతెమ్మ గుట్టపై నిర్వహిస్తున్న గొంతెమ్మ లక్ష్మీదేవర గుట్ట జాతర శనివారం రెండో రోజు వైభవంగా కొనసాగింది. శుక్రవారం ప్రారంభమైన జాతర వేడుక రెండో రోజు గుట్టపైకి లక్ష్మీదేవర, ఇతర దేవతామూర్తుల రాకతో సందడిగా మారింది. అంతకముందు జాతర కమిటీ, ఆలయ కమిటీ, నాయక్‌పోడ్ సంఘాల ఆధ్వర్యంలో కాటారం మండలకేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన లక్ష్మీదేవర బృందాలు డప్పుచప్పుల్ల నడుమ సాంప్రదాయ నృత్యాలతో ఆడిపాడారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. అనంతరం గుట్టపైకి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, ఆలయ, జాతర కమిటీ సభ్యులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో మెడికల్ బోర్డు ద్వారా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ బ్రాంచ్ కమిటీ నాయకులు శనివారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలల క్రితం ఎన్నికల నేపథ్యంలో యాజమాన్యం నియామకాల పత్రాల పంపిణీ ప్రక్రియ నిలిపివేసిందన్నారు. ఎన్నికల పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నియామక పత్రాలు అందజేయకపోవడంతో ఆశగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రానుందని తెలిపారు. సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి నియామక పత్రాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజేందర్, శ్రీనివాస్, ఆఫీస్‌పాషా, మాటేటి శ్రీనివాస్, కరీముల్లా, రమేష్, సారయ్య, మహేందర్‌రావు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

భూపాలపల్లి అర్బన్: ఆటోడ్రైవర్లు ఆటోలను నడిపే సమయంలో తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని భూపాలపల్లి డీఎస్పీ రాములు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లాకేంద్రంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా డీఎస్పీ రాములు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సెంటర్ నుంచి జయశంకర్ విగ్రహం వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. లైసెన్స్‌లు తప్పకుండా ఉండాలని, తాగి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని, ఆటో రిజిస్ట్రేషన్ నంబర్ కనబడేలా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ సెంటర్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ రాములు

సమయం చాలా విలువైనది

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి అర్బన్: మానవ జీవితంలో అన్నింటి కంటే విలువైనది సమయం అని, ఏది కోల్పోయినా తిరిగి వస్తుంది కానీ పోయిన సమయాన్ని వెనక్కి తీసుకురాలేమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జయరాంరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీనియర్ జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలను చేరాలని సూచించారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్నపిల్లలు వాహనాలు నడుపరాదని, ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని అన్నారు. ఎవరికి ఆపద వచ్చినా జిల్లా న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని చెప్పారు. నేరుగా సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రజిత, అధ్యాపకులు శోభన్‌బాబు, పాఠశాల సిబ్బంది, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

సమ్మక్క- సారక్క జాతర ఆడియో రిలీజ్

ఏటూరునాగారం: తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన రచయిత, గాయకురాలు మద్దెల సమ్మక్క పాడిన పాట ప్రైవేట్ ఆడియోను మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒక నిరుపేద కుటుంబానికి చెందిన సమ్మక్క వనదేవతలను స్మరించుకుంటూ పాటలు పాడటం అభినందనీయమన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి సహకరించామని తెలిపారు. ఆమె మరిన్ని పాటలు రాయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంతటి విజయ, నాయకులు పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి

- వనదేవతల దర్శనానికి వన్‌వే..

ఎస్ఎస్‌తాడ్వాయి: సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు మేడారానికి శనివారం భక్తులు వేలాది మంది తరలివచ్చారు. జంపన్నవాగు షవర్ల కింద జల్లు స్నానాలు చేసి కల్యాణ కట్టలో పుట్టువెంట్రుకలను సమర్పించుకున్నారు. అనంతరం వనదేవతల గద్దెల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్లకు ఎత్తు బంగారం మొక్కుగా సమర్పించిన భక్తులకు పూజారులు బెల్లం ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులతో గద్దెల ప్రాంగణం సందడిగా మారింది. దుకాణాలు భక్తుల రద్దీతో కనిపించాయి.

వన్‌వే దర్శనం

భక్తులను గద్దెలపైకి దర్శనానికి పంపించేందుకు వన్‌వే ఏర్పాటు చేశారు. భక్తులందరూ గద్దెల వద్దకు వచ్చి దర్శించుకునేందుకు ఎస్పీ శబరీశ్ మంచి ఆలోచన చేశారు. గద్దెల వద్ద దర్శన సమయంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్లలో వచ్చిన భక్తులు అమ్మవార్ల గద్దెపై ఒక పక్క నుంచి భక్తులు దర్శనం చేసుకునేలా హుండీలను అడ్డుగా ఏర్పాటు చేశారు. భక్తులు హుండీల్లో కానుకలు సమర్పించడంతో పాటు సమ్మక్క గద్దె వద్ద నుంచి వెంటవెంటనే సారలమ్మ గద్దెపైకి పంపించేందుకు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. దీంతో భక్తులకు ఎక్కువ సేపు గద్దెల వద్ద ఉండకుండా చర్యలు తీసుకోవడంతో భక్తులు గద్దెల వద్దకు చేరుకుని దర్శించుకున్నారు. ఎస్పీ శబరీశ్ గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీని పర్యవేక్షించారు. ఎస్పీ వెంట ఓఎస్డీ అశోకుమార్, డీఎస్పీ రవీందర్ ఉన్నారు.



గద్దె వద్ద వన్‌వే ఏర్పాటు చేసిన పోలీసులు

అమ్మవార్లకు ప్రముఖుల పూజలు

మేడారం సమ్మక్క– సారలమ్మను జిల్లా జడ్జి పీవీపీ లలితశివజ్యోతి, సీనియర్ సివిల్ జడ్జి మాధవి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రామమోహన్ రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సౌఖ్యలు దర్శించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. జడ్జీల వెంట పస్రా సీఐ శంకర్ ఉన్నారు. అదే విధంగా పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీర్ చీఫ్ సంజీవరావు కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతీయ పొగాకు బోర్డు డైరెక్టర్ శేషుమాధవ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రేమల దంపతులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

యూనివర్సిటీ భూములను ప్రభుత్వం కాపాడాలి



ములుగు రూరల్: రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ భూములను ప్రభుత్వం కాపాడాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడుదుల మమన్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లాకేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు భవన నిర్మాణానికి వ్యవసాయ యూనివర్సిటీ భూమిని కేటాయించడం సరికాదన్నారు. జీఓ నంబర్ 55ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడం సరికాదని విమర్శించారు. నిరసన చేపట్టిన క్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై పోలీసులు అతిక్రూరంగా దాడి చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

హేమాచలక్షేత్రంలో భక్తుల పూజలు



స్వయంభు స్వామివారు



దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

మంగపేట : రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధి గాంచిన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయంలోని స్వయంభు స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో తరలివచ్చారు. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు కార్లు, ఆటోలు, వివిధ ప్రైవేట్ బస్సులు తదితర వాహనాల్లో ఉదయాన్నే గుట్టపైకి చేరుకుని ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ, కారంపుడి పవన్‌కుమార్, ఆచార్యులు ఈశ్వర రామానుజ దాస్ స్వామివారికి ఉదయం 10 నుంచి 12గంటల వరకు నువ్వుల నూనెతో తిల తైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని భక్తులు పులకించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ పూజారులు గోత్ర నామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు.

తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీలు రద్దు

హన్మకొండ : తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీలన్నింటిని రద్దు చేస్తున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యూనియన్‌ను మరింత బలోపేతానికి రాష్ట్ర, జిల్లా, మండల, రెవెన్యూ, పట్టణ కమి టీలన్నింటిని రద్దు చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రైవర్ల సంక్షేమానికి పాటు పడేవారిని కమిటీల్లో భాగస్వాములను చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలో నూ తన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.



యాసంగి వరిసాగుపై అవగాహన

- అధిక దిగుబడి, యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు

హన్మకొండ : వివిధ కారణాలతో వానాకాలం వరి పంట కోతలు ఆలస్యమయ్యాయి. దీంతో యాసంగిలో వరి నాట్లు వేసేందుకు అదను తప్పుతోంది. ఈ సందర్భంగా వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.విశ్వతేజ, బి.దిలీప్ కుమార్, యు.నాగభూషణం వరిసాగులో అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పటి వరి నారు పోసుకోని రైతులు నేరుగా విత్తుకోవడం మంచిదని సూచించారు. డ్రమ్ సీడర్‌తో కాని, వెదజల్లే పద్ధతిలో కాని నేరుగా విత్తు కోవచ్చు. ఇందుకు 10 నుంచి 12 కిలోల విత్తనం అవసరం. లీటర్ నీటికి 1 గ్రాము కార్బండిజం, కలిపిన ద్రావణంలో విత్తనాలను 12 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టి కొద్దిగా పగిలిన దశలో డ్రమ్ సీడర్ ద్వారా కాని నేరుగా పొలంలో వెద జల్లాలి. ఈ పద్ధతుల్లో వేసిన పంట 7 నుంచి 10 రోజులు ముందుగా కోతకు వస్తుంది. రైతులకు నాటు ఖర్చులు మిగులుతాయి. యాసంగిలో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు చలి తీవ్రతతో నార్లు ఎదుగకుండా ఎర్రబడుతాయి. ఇందుకు నారుమడిపై పాలిథీన్ లేదా టార్పాలిన్ కవర్లు సాయంత్రం కప్పి మరుసటి రోజు ఉదయం తీసివేయాలి.


రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

కలుపు నివారణ..

నాటు పద్ధతిలో వేసుకున్న వరిలో నాటిన 3 నుంచి 5 రోజుల్లో బ్యూటాక్లోర్ 1–1.5 లీటర్లు లేదా ప్రెటిలాక్లోర్ 500–600 మిల్లీ లీటర్ల మందును ఇసుకలో కలిపి చల్లుకోవాలి. అదే విధంగా నేరుగా విత్తిన వరిలో ఎకరాకు ప్రెటిలాక్లోర్‌ను సెఫనర్ 600–800 మిల్లీ లీటర్ల మందును విత్తిన 3 నుంచి 5 రోజుల లోపు లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ 80 నుంచి 100 గ్రాములు లేదా బ్యూటాక్లోర్ 1–1.5 లీటర్ల మందును 8 నుంచి 10 రోజులలోపు ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

చీడపీడల యాజమాన్యం

యాసంగి వరిలో కాండం తొలుచు పురుగు తీవ్రత అధికంగా ఉంటుంది. దీని నివారణకు నారు తీసే వారం రోజుల ముందు 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు చల్లిన తర్వాత నాటుకోవాలి. అలాగే పొలంలో పిలక, దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోలు లేదా క్లోరాంట్రానిలీప్రోల్ 0.4 గుళికలు 4 కిలోలు ఇసుకలో కలిపి చల్లుకోవాలి. ఊస తిరిగే (తాలు కంకి) సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో చిరుపొట్ట దశలో కార్టాన హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పీ. 400 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్.పీ. 60 మిల్లీ లీటరు 200 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అగ్గి తెగులును గమనిస్తే ట్రై సైక్లాజోల్ 150 గ్రాములు లేదా కాసగామైసిన్ 500 మిల్లీ లీటర్లు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. బాక్టీరియా ఆకు ఎండు తెగులు సోకితే నత్రజని ఎరువులు తాత్కాలికంగా నిలిపి అగ్రిమైసిన 100 గ్రాములు లేదా ప్లాంటమైసిన్ 50 గ్రాముల మందును 200 లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. యాసంగి వరిలో కోతల సమయంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల నూక శాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుంది. రైతులు పంటను పొడిగించకుండా సకాలంలో కోతలు చేపట్టాలి. అధికారులు సూచించిన సస్య రక్షణ, ఎరువులు, కలుపు, నీటి యాజమాన్యం సరైన పద్ధతిలో తప్పకుండా పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు.

ఎరువుల వాడకం..

ఎరువుల యాజమాన్యానికి రైతులు వరిలో ఎకరానికి 48 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్‌ను కాంప్లెక్స్ ఎరువుల రూపంలో దఫాల వారీగా వేసుకోవాలి. భాస్వరం ఎరువైతే పూర్తిగా దమ్ము దశలోనే వేసుకోవాలి. యాసంగిలో ఎక్కువగా గమనించే జింకు లోపాన్ని నివారించడానికి చివరి దమ్ములో ఎకరాకు 20 కిలోల ముడి జింక్ వేసుకోవాలి.



ఆటోను ఢీకొన్న లారీ

- తొమ్మిది మందికి స్వల్పగాయాలు

కురవి : మట్టిలోడుతో వస్తున్న లారీ, ప్యాసింజర్ ఆటోను ఢీకొన్న సంఘటన మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు ఎర్రమట్టిలోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో మానుకోటకు వెళ్తున్న బి.రమేష్, అరూరి ఉపేంద్ర, రాసాల సంధ్య, బానోత్ తేజ్యా, నవీన్, ఇస్లావత్ అఖిల, కందుల అరవింద్, కందుల శివాణి, రాసాల వెంకన్న గాయపడ్డారు. కందుల అరవింద్ కుడి చేతికి తీవ్రగాయమైంది. విషయం తెలియగానే కురవి ఎస్సై బి.గోపి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వెంటనే లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రులను 108లో మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. 14ఏళ్ల యువకుడు(చిన్న పిల్లాడిలా కనిపిస్తున్న వ్యక్తి మరుగుజ్జు) కుడి చేతికి తీవ్రంగా గాయం కాగా, అతని చేతికి కుట్లు వేసి చికిత్స అందజేశారు. మిగిలిన వారికి ప్రాథమిక వైద్యం చేసి ఇళ్లకు పంపివేశారు. అరవింద్ చేతికి గాయమైనప్పటికీ కిందపడిపోయిన మహిళ నుదుటిని నిమరడంతో సంఘటన స్థలానికి వచ్చిన వారి హృదయం ద్రవించింది. ఈ సంఘటనపై ఇంత వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్సై గోపి తెలిపారు.


గాయపడిన మహిళ వద్ద యువకుడు (మరుగుజ్జు)


స్పృహతప్పిన మహిళలు

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్‌లుగా గుర్తించాలి

- కంపెనీ వ్యాప్తంగా సమాన వేతనం చెల్లించాలి
- టీఎస్ ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ శ్రీధర్

హన్మకొండ : టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్‌లుగా గుర్తించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ ఈఈయూ–327) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ యాజమాన్యాన్ని కోరారు. శనివారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని టీఎస్‌ఈఈయూ–327 కార్యాలయంలో అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్కర్ల సమస్యలపై చర్చించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ కంపెనీ పరిధిలోని అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా వేతనాలు చెల్లించడం అన్యాయమన్నారు. అదే విధంగా వీడీఏ ఇవ్వకపోవడంతో చాలా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీ వ్యాప్తంగా వీరికి ఒకే రకమైన సమాన వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతి నెల 5వ తేదీలోగా వేతనాలు ఇవ్వాలన్నారు. టీఎస్ సదరన్ విద్యుత్ పంపిణీ కంపెనీలో అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్‌లకు వీడీఏ చెల్లిస్తుండగా నార్తర్న్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో చెల్లించకపోవడం అన్యాయం చేయడమేనన్నారు. అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ చనిపోతే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, విద్యుదాఘాతంతో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. జూనియర్ లైన్‌మన్ నోటిఫికేషన్‌లో అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు వెయిటేజీ మార్కులు కేటాయించాలని కోరారు. సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో కట్టర్లను ఆర్టిజన్‌లుగా గుర్తించినట్లుగానే ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్‌లుగా గుర్తించాలన్నారు. అదే విధంగా సబ్ స్టేషన్‌లలో ఖాళీగా ఉన్న ఆపరేటర్ పోస్టులను ఐటీఐ అర్హత కలిగిన అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్‌లతో భర్తీ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇనుగాల శ్రీధర్, టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్‌రెడ్డిని పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల సంఘం ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు కుర్రి సుధాకర్, కార్యదర్శి నందిపాటి వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ బిచ్చునాయక్, నాయకులు అబ్బోజు పూర్ణాచారి, డేగ రవి, వెంకన్న, బూర వరుణ్, పాండు, గంగన్న, కమలాకర్, లక్ష్మణ్, పరశురాం, ప్రవీణ్, అరుణ్, శ్రీశైలం, రంగన్న, రఫీ పాల్గొన్నారు.


ఇనుగాల శ్రీధర్, పి.మహేందర్ రెడ్డిని సన్మానిస్తున్న వర్కర్లు

రహదారి భద్రత జీవనవిధానం కావాలి

- వరంగల్ ఆర్టీఓ రంగారావు
- ఆర్టీఏ జంక్షన్‌లో రోడ్డు భద్రతపై బైక్‌ర్యాలీ

ఖిలా వరంగల్: రహదారి భద్రత ఒక నినాదంలా కాకుండా సామాజిక బాధ్యత, జీవన విధానంగా మల్చుకున్నప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని వరంగల్ ఆర్టీఓ రంగారావు సూచించారు. జాతీయ రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి ఆర్టీఏ జంక్షన్‌లో ఎంవీఐ కోల రవీందర్, రమేష్‌రాథోడ్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన, బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్టీఓ హాజరై బైక్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వ్యక్తితోపాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలపై పరిమితిని మించి ప్రయాణం చేయద్దని పేర్కొన్నారు. ఓవర్‌టేక్, అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడుపొద్దని సూచించారు. వాహనదారులు రాత్రివేళల్లో వాహనాన్ని నిలిపి ఉంచినప్పుడు పార్కింగ్ లైట్లు తప్పనిసరిగా వేసి ఉంచడంతో ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రోడ్డుపై ముందు వెళ్తున్న వాహనదారుడు, డ్రైవర్ దారి ఇవ్వకుంటే వాహనము దాటే ప్రయత్నాన్ని విరమించుకోవాలని సూచించారు. ప్రమాదరహిత జిల్లాగా మార్చుకునేందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్వరూపరెడ్డి, ఎంవీఐ స్వర్ణలత, శాలిని, విద్యార్థినీ, విద్యార్థులు, వాహనదారులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంవీఐ రవీందర్



సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

- హనుమకొండ బాలసముద్రం మెయిన్ రోడ్ 1st Floorలో 1000sft గల కమర్షియల్ స్పేస్ ఆఫీసులకు, చిట్‌ఫండ్ కంపెనీలకు, క్లినిక్స్‌కు అనుకూలమైనది. కిరాయికి ఇవ్వబడును. 9700285551, 8074585982. [WA-7280]

PLOT FOR SALE

- GWMC వరంగల్ చింతగట్టులో వెంటనే నిర్మాణం చేయడానికి అనువైన 603 (70.6x77) చ॥గ॥ LRS East Face ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ 8019950229 [W-788987]
- టేకులగూడెం రింగురోడ్ 1/2 కిలో మీటర్ సోమిడి కాజీపేట రోడ్‌లో 200 గజాలు 36x50 ప్లాటు అమ్మకానికి కలదు. సంప్ర॥ సెల్: 9989545233. [W-1220974]
- అతి చిన్న పెట్టుబడి రేపు అధిక రాబడి 121 చ॥గజాల ప్లాటు రూ. 2,40,000/– యాదగిరిగుట్ట దగ్గర @ ఆలేరు- EMI కలదు. ప్లాటు ఉంటే ఆర్థిక ఎదుగుదల, ఆత్మధైర్యం. సెల్: 8179608180. [W-1220971]

FLAT FOR SALE

- 2BHK Flat, 945 sft N/E, 3rd Floor At LB Nagar, Opp: A1 Function Hall, Warangal 25 Lakhs Negotiable. Ph: 7382112623 [HA-13022]

SERVICES

- హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Man Power Service చేయబడును. సంప్ర॥ 7659010270. [WA-7277]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

- మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-788980]

BUSINESS OFFER

- *వరంగల్ జిల్లా ప్రజలకు శుభవార్త* ఇప్పుడు చిన్న పెట్టుబడితో Bussiness చేసి 1,80,000 రూపాయలు సంపాదించుకునే గొప్ప సువర్ణవకాశం, 100% Decentralization, Block Chain సంప్రదించండి. ఫోన్: 6302280020 [H-788194]

WANTED

- Wanted Pharmacist Typist Personal Assistant, MEP Manager, PRO (MBA Marketing) with Hospital Experience Qualified Cont: 7337313271, 9949499959. [WA-13902]



- గవర్నమెంట్ సంస్థలో పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. సంప్ర॥ 9704013331. [W-1220973]
- యువరాజ్ కిరాణంలో పనిచేయుటకు కిరాణంలో 3 సం॥ చేసిన అనుభవం గల యువతీ, యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం, వరంగల్ లోకల్ వారికి మాత్రమే. సంప్ర॥ అండర్ బ్రిడ్జి దగ్గర, వరంగల్. 9490133696. [WA-7278]
- Govt (Regd) సంస్థ తరపున Work చేయుటకు సొంత కంప్యూటర్ గలవారు కావలెను. ఇంటి దగ్గరే వర్క్ చేస్తూ 9 to 19K వరకు సంపాదించే అవకాశం. సెల్: 8977429273. [W-788986]
- Srinivasa Pinnacle Hospital లో పనిచేయుటకు Duty Doctors, Nursing Staff, B-Pharmacy మరియు Degree చేసినవారు కావలెను resumes తీసుకొని సోమవారం 29-01-2024. 12PM కి రాగలరు. [WA-13901]
- సుబేదారి నందు గల గర్ల్స్ హాస్టల్ ఫర్నీచర్ తోని అమ్మబడును. హాస్టల్లో ఉండి వంట చేయుటకు వంట మనిషి కావలెను (లేడీస్) సంప్ర. 8328620934. [W-1229397]
- హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటర్ అర్జెంటుగా కావలెను. జీతం: 8000 – 10000. సెల్: 9703637320. [W-1220892]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా యాడ్స్ పంపిస్తూ వారానికి 3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సెల్: 7702518530, 8019341329. [M-1233755]
- బాలాజీ గ్రూప్ (A.P, T.S & న్యూఢిల్లీ నెం-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15–21 వేలు. ఏజెంట్లకు 5000/కమీషన్ 9133271122 / 9052671122. [H-787781]
- విజయవాడలో A/C & Coolers రెంటల్ (tower-ac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1255218]
- మార్కెటింగ్ లీడర్స్ ఫుల్‌టైం/ పార్ట్ టైం/ కమీషన్ పద్ధతిలో పని చేయుటకు రిటైర్డ్ ఉద్యోగులు, గృహిణులు, ఇన్సూరెన్స్ ఏజెంట్స్, రియల్ ఎస్టేట్ వర్కర్స్, అనుభవం లేని వారికి కూడా శిక్షణ ఇవ్వబడును. సంప్ర: 9701364270 [K-1185956]
- Hydలో పనిచేయుటకు సెక్యూగార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, లేడీ గార్డ్స్, ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. ఏరియా: బాలానగర్, మియాపూర్, జీడిమెట్ల, గండిమైసమ్మ కొల్లూరు రూం ఫ్రీ మెట్రో మేనేజ్‌మెంట్ ఫోన్: 9963077722/ 9885657155 [H-801465]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన **260/-రూ॥** అదనపు లైను **60/- రూ॥ మాత్రమే** 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చెన్నారావుపేట : ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన సాదు చిరంజీవి (35) మూడేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల నడుమ కలహాలు చోటు చేసుకుంటుండడంతో మానసిక ఇబ్బందులు పడుతున్నాడు. కాగా శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి తండ్రి కొంరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.


చిరంజీవి (ఫైల్)

పెరకవాడలో యువతి..

ఖిలా వరంగల్ : వరంగల్‌లోని రైల్వేగేట్ పెరకవాడకు చెందిన ముంజ కోమల వస్త్ర దుకాణంలో పనికి వెళ్తూ ఇద్దరు కుమార్తెలు నవ్య, అఖిలను సాకుతోంది. పెద్ద బిడ్డకు పెళ్లి చేయగా చిన్న కుమార్తె ముంజ అఖిల(19) నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. కాగా, యువకుడితో ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమకు దారితీసింది. ఈ ప్రేమ వ్యవహారం తల్లికి తెలియడంతో శుక్రవారం రాత్రి కుమార్తెను మందలించింది. తల్లిపై కోపంతో ఇంటిపక్కనే ఉన్న పెద్దమ్మ ముంజ జయ ఇంటికి వెళ్లి అక్కడే నిద్రిస్తోంది. ఉదయాన్నే తల్లి షాపునకు వెళ్లడం, పెద్దమ్మ పనికి వెళ్లింది. ఈ క్రమంలో ప్రేమించిన వ్యక్తితో పెళ్లి కాదని, తల్లి మందలింపుతో మనస్తాపానికి గురైన అఖిల శనివారం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చిన జయకు అఖిల ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. ఈవిషయాన్ని అఖిల తల్లితోపాటు మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేశారు. కన్నబిడ్డ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి ఆ తల్లి కన్నీరుమున్నీరైంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి యువతి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురికి తరలించారు. మృతురాలి తల్లి కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎండి ముస్నీరుల్లా తెలిపారు.


అఖిల (ఫైల్)

మతరాజకీయాలను తిరస్కరించాలి

- ఎంసీపీఐ(యు) జాతీయ కార్యదర్శి అశోక్

దుగ్గొండి : దేశంలో వివిధ రాజకీయ పార్టీలు సాగిస్తున్న మత రాజకీయాలను తిరస్కరించాలని ఎంసీపీఐ(యు) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. మండలంలోని గిర్నిబావిలో గల ఓ కన్వెన్షన్ హాల్‌లో పార్టీ జిల్లా కమిటీ వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మత రాజకీయాలకు తెర తీసిందన్నారు. మతం పేరుతో రాజకీయాలు భారత ప్రజాస్వామ్యానికి, లౌకిక వాదానికి ప్రమాదమన్నారు. మతం పేరుతో బీజేపీ, లౌకికత్వం పేరుతో కాంగ్రెస్ ప్రజల్లోకి వస్తోందని వీరిని బలపరిచిన పెట్టుబడిదారుల తొత్తులయిన బూర్జువా పార్టీలను ప్రజలు తిరస్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంద రవి, నర్ర ప్రతాప్, నాగెల్లి కొంరయ్య, వంగాల రాగసుధ, కుసుంబ బాబురావు, కన్నం వెంకన్న, రాజాసాహెబ్, చుంచు జగదీశ్వర్, కొత్తకొండ రాజమౌళి, సింగతి మల్లికార్జున్, కందికొండ కుమారస్వామి, యాదగిరి, జన్ను రమేష్, బత్తిని కుమారస్వామి, గటికె జమున, ఎల్లబోయిన రాజు, సురేందర్, ఐలోని, గణేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

'మార్కెటింగ్ లక్ష్యాలను సాధించాలి'

వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మార్కెటింగ్‌శాఖకు నిర్దేశించిన మేరకు లక్ష్యాలను సాధించాలని ఆ శాఖ సంయుక్త సంచాలకుడు మల్లేశం అన్నారు. శనివారం వరంగల్ లక్ష్మీపురంలోని జేడీఎం కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన మార్కెట్ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కమిటీల పరిధిలోని వ్యాపారులకు సంబంధించిన మార్కెట్ ఫీజులు పూర్తిగా వసూలు చేయాలన్నారు. ఎలాంటి పెండింగ్ బకాయిలు ఉండొద్దన్నారు. ఈసమావేశంలో డీడీఎం అజ్మీరా రాజు నాయక్, వరంగల్, పరకాల, ములుగు, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, కేసముద్రం, మహబూబాబాద్, ఆత్మకూరు మార్కెట్ కమిటీల కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

పేటెంట్ల వాణిజ్యకరణతోనే ఉపాధి

- ఓయూ ఆచార్యులు జి.బి.రెడ్డి

కేయూ క్యాంపస్ : పేటెంట్ల వాణిజ్యకరణతోనే విస్తృత ఉపాధి అని ఉస్మానియా యూనివర్సిటీ ఆచార్యులు జి.బి.రెడ్డి అన్నారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, తెలంగాణ ప్రభుత్వం ఈఎఫ్ఎస్ అండ్ టీ డిపార్టుమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని సెనేట్ హాల్‌లో నిర్వహించిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేథోసంపత్తి హక్కుల విషయంలో విశ్వవిద్యాలయం ఒక కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కేయూ ఫార్మసీ అధ్యాపకులు ఈ రంగాన్ని అభివృద్ధి చేయడంలో కీలకంగా పనిచేశారన్నారు. కేవలం రంజాన్ మాసంలోనే లభించే హలీం ఇప్పుడు ఏడాది పొడవునా అందుబాటులో ఉందని, ఇది మేథోసంపత్తికి హక్కులకు ఉత్తమ ఉదాహరణ అన్నారు. అలాగే చేర్యాల పేయింటింగ్స్, కాకతీయ కళాతోరణం కూడా ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌కింద నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటలెక్చువల్ ప్రాపర్టీరైట్స్ అండ్ లీగల్ సుభాజిత్ సాహా ఇంపార్టెంట్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైనర్ అకాడమి అనే అంశంపై మాట్లాడుతూ టెక్నాలజీ వేగంగా దూసుకుపోతుందన్నారు. అయితే కేవలం 5 నుంచి ఆరు పేటెంట్లు మాత్రమే వాణిజ్యకరణకు నోచుకుంటున్నాయన్నారు. ప్రస్తుత తరుణంలో భౌగోళిక గుర్తింపు అవసరం అన్నారు. ఆ జాబితాలో బంగినపెల్లి మామిడి, తాండూరు బెల్లం, వరంగల్ ఎర్రమిర్చి వస్తాయన్నారు. పురాతన కట్టడాలు, బిల్డింగ్‌లు కూడా ఈ కోవకే వస్తాయన్నారు. ఈ సమావేశంలో కేయూ ఐపీఆర్ సెల్ నోడల్ ఆఫీసర్, కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్, వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జి.బి రెడ్డి, పక్కన సుభాజిత్ సాహా

ప్రాక్టికల్ ట్రైనింగ్‌తో కోర్సు విలువ పెంపు

- కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: ప్రాక్టికల్ ట్రైనింగ్‌తో కోర్సు విలువ పెరుగుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం యూనివర్సిటీ పరిధిలోని కామర్స్ అధ్యాపకులకు క్యాంపస్‌లోని కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలోని సెమినార్ హాల్‌లో నిర్వహించిన అధ్యాపకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రిపోర్ట్ రైటింగ్‌పై ఓరియంటేషన్‌లో ఆయన మాట్లాడుతూ కామర్స్ కోర్సుకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ప్రాజెక్టు రిపోర్టు, గ్రూప్ ప్రాజెక్టు రిపోర్టుతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్.నర్సింహాచారి మాట్లాడుతూ రిపోర్టు రైటింగ్ అనేది ఒక సిస్టమాటిక్ పద్ధతి అన్నారు. కార్యక్రమంలో కామర్స్ బీఓఎస్ ఆచార్య కట్ల రాజేందర్, కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ ప్రగతి, కటకం ఫణీంద్ర, పరిశోధక విద్యార్థులు సుమన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు

బాలుడి చికిత్సకు సాయం చేయండి



నయీంనగర్ : తమ చిన్నారి చికిత్సకు దాతలు సహకరించి ఆదుకోవాలని బాలుడి తల్లిదండ్రులు మౌనిక-నాగరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు తమ దీనగాథను వివరించారు. ములుగు జిల్లా చల్వాయి గ్రామానికి చెందిన తమకు రాము–లక్ష్మణ్ (కవలలు) జన్మించారు. కాగా మూడేళ్ల బాలుడు లక్ష్మణ్ 2024 జనవరి 17న ఆడుకుంటూ కిందపడటంతో తలకు గాయమైంది. అందులోనూ ఫిట్స్ రావడంతో ములుగు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం హనుమకొండకు వెళ్లాలని అక్కడి వైద్యులు రెఫర్ చేశారు. దీంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్ సూచన ప్రకారం సిటీ స్కాన్ చేయడంతో తలలో రక్తం గడ్డ కట్టిందని వెంటనే ఆపరేషన్ చేయాలని, లేదంటే బాబు ప్రాణానికి ప్రమాదమనడంతో అదేరోజు రాత్రి దాతలు, బంధువుల సాయంతో ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం వెంటిలేషన్‌పై చికిత్స అందుతోందని రోజుకి రూ.65వేలు ఖర్చు అవుతోందని తెలిపారు. బాబు చికిత్స కోసం దాతలు సాయం చేయాలని తల్లిదండ్రులు నాగరాజు–మౌనిక ప్రాధేయపడ్డారు.

దాతలు 80089 94920, 9963174160
నంబర్లలో ఫోన్ పే, గూగుల్ పే చేయాలని తల్లిదండ్రులు కోరారు.